కోల్డ్ స్టోరేజీ కల నెరవేరేదెన్నడు?

- ప్రభుత్వం నిర్మించి ఆదుకోవాలంటున్న రైతాంగం
- అందుబాటులోకి వస్తే తీరనున్న దళారుల బెడద
- గిడ్డంగుల నిర్మాణాలకు ప్రోత్సాహంలో భాగంగా 30 శాతం సబ్సిడీ


కోడూరు మండలంలో రైతులు సాగు చేస్తున్న అరటి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని 5 మండలాలలో మామిడి, అరటి, బొప్పాయి, పసుపు పంటలపై రైతులు పెద్దఎత్తున ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆరుగాలం కష్టించాక పంట చేతికొస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధరలేక నిల్వ చేసుకునేందుకు చోటు లేక రైతులు దళారుల చెప్పిన మొత్తానికి పంటను అమ్మి అప్పుల ఊబిలో కృంగిపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత రైతులకు కోల్డ్‌స్టోరేజీ (శీతల గిడ్డంగి) కలగానే మిగిలిపోతోంది. ఉద్యాన పంటలు అధికంగా సాగయ్యే కోడూరు ప్రాంతంలో ఇక్కడి రైతులు కోల్డ్ స్టోరేజీ కోసం కొండంత ఆశతో వేచిచూస్తున్నారు. ఆ దిశగా నాయకులు, అధికారులు కృషి చేయాలని రైతులు కోరుకొంటున్నారు. ఈ ప్రాంతంలో పండే పంటలు ఎగుమతులకు అనువుగా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తారని ఇక్కడి రైతులు నమ్మకంతో ఉన్నారు. ప్రతి ఏడాది పంటలు చేతికి వచ్చే సమయానికి ధరలు పాతాళానికి పడిపోయి రైతులు కుదేలవుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 65వేల ఎకరాలకు పైబడి అరటి, మామిడి పంట అయితే వేలాది ఎకరాల్లో పండిస్తుంటారు. ఇక్కడ పండించిన మామిడి, అరటిని బెంగుళూరు, చెన్నై, మైసూరు, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల కోసం కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తే లాభం చేకూర్చినట్టు అవుతుంది. అరటి, మామిడి, నిమ్మ, పసుపు పంటలు నిల్వచేసుకొని అధిక రేటు వచ్చినప్పుడు అమ్ముకోవడానికి వీలుంటుంది.

దళారుల మోసాలకు చెక్!

కోల్డ్ స్టోరేజ్‌లు, రీఫైనింగ్ చాంబర్‌లు నిర్మిచడం వల్ల దళారీల మోసాలకు చెక్‌పడుతుంది. అప్పుడు రైతులు తాము పండించిన పంటలను సరైన ధర లభించినప్పుడు అమ్ముకునే సదుపాయం ఉంటుంది. ఇక్కడి దళారీలు రైతుల కడుపుకొట్టి వందల కోట్లలో అరటి, బొప్పాయి, మామిడి, దోస తదితర వ్యాపారాలు ప్రతి ఏడాది నిర్వహిస్తుంటారు. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి సేట్‌లు ఇక్కడికి వచ్చి మకాం ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తుంటారు. ఇదే అదునుగా రైతులకు, వ్యాపారులకు మధ్య దళారులు చేరి సేట్‌లతో ఒకరేటు, రైతులకు ఒకరేటు, లోడ్ తూకాలలో కోత, కమీషన్‌లు ఇలా అన్ని రకాలుగా రైతును మోసం చేసి కోట్లు కొల్లగొడుతున్నారు.


నియోజకవర్గంలో సాగవుతున్న పసుపు పంట

ఉద్యాన పంటల వివరాలు (ఎకరాల్లో)				
మండలం	మామిడి	అరటి	బొప్పాయి	పసుపు
కోడూరు	12050	2500	1500	425
ఓబులవారిపల్లి	1975	1830	2462	620
చిట్వేలి	4697	838	1890	124
పుల్లంపేట	1500	2200	650	225
పెనగలూరు	8300	295	315	75

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ఉద్యాన పంటల సాగుకు నిలయం కోడూరు ప్రాంతం. వేల ఎకరాల్లో రైతులు అరటి, మామిడి, బొప్పాయి పంటలను సాగు చేస్తున్నారు. దళారుల చేత మోసపోవడం రైతుల వంతు అవుతోంది. ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మించడమేకాక పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. దీని వల్ల రైతులకు లాభం చేకూర్చినట్టు అవుతుంది.

– ముద్దులూరు సుబ్బరామరాజు, మాజీ మార్కెట్ చైర్మన్, కోడూరు

లాభం రావడంలేదు



మార్కెట్‌లో పండించిన పంటలకు మంచి ధర ఉన్నా రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. దళారులు రైతులను మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాము మాత్రం అప్పుల ఊబిలో చిక్కుకొని ఆవేదనకు గురవుతున్నాం. ప్రభుత్వమే రైతులు పండించిన పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. కోడూరు ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మిస్తే రైతులకు సాయం చేసినవారవుతారు.

– సిద్దారెడ్డి, రైతు, కేసీ అగ్రహారం, రైల్వేకోడూరు

ధరలు పెరిగినప్పుడు ఎగుమతులు



కోల్డ్‌స్టోరేజీ వల్ల రైతులకు కొంత మేర మేలు చేకూరుతుంది. పంట ఉత్పత్తులు చెడిపోకుండా రైతులు నిల్వ చేసుకొని ధరలు వచ్చినప్పుడు అమ్ముకోవచ్చు దిగుబడి నాణ్యత దెబ్బతినకుండా ఉంటుంది. కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం 30 శాతం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంది. ప్రైవేట్ వ్యక్తులు లేదా రైతులు యూనిట్‌గా ఏర్పడి కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలను చేపట్టాలి.

– ఎం.వెంకటభాస్కర్, ఉద్యానశాఖ అధికారి, రైల్వేకోడూరు

క్లుప్తంగా

25న టాలెంట్ టెస్టు

పుల్లంపేట : ఈనెల 25న ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు మండలస్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వల్లూరు సిద్దయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో ఈ పోటీ జరుగుతుందన్నారు. టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. వివరాలకు 63037 01314ను సంప్రదించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వరప్రసాద్ పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంత విద్యార్థులు 4వ తరగతి, 10వ తరగతి చదువుతున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకు మార్చి 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న జరుగుతుందని తెలిపారు. వివరాలకు 88979 83930, 93477 83214లను సంప్రదించాలని తెలియజేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మృతి


బొడిచెర్ల వెంకట సుబ్బయ్య (ఫైల్)

రాజంపేట టౌన్ : మండలంలోని డీబీఎస్ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ బొడిచెర్ల వెంకటసుబ్బయ్య (58) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటసుబ్బయ్య బుధవారం పాఠశాలకు వచ్చి తన విధులను కూడా చురుకుగా నిర్వర్తించాడు. అయితే అదే రోజు రాత్రి 7:30 గంటల ప్రాంతంలో గుండెలో నొప్పి వచ్చి, శ్వాస పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మరణవార్తను తెలుసుకున్న ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 38 ఏళ్ల సర్వీసులో ఆయన విద్యార్థులకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలకు గాను గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

రాజంపేట : నందలూరు మండలం ఎగువరాచపల్లె (సోమశిల ముంపు గ్రామం)కు మూడు దశాబ్దాలపాటు ఏకగ్రీవంగా పనిచేసిన మాజీ సర్పంచ్ బాలరాజు కృష్ణవేణమ్మ గురువారం మృతి చెందారు. ఈమె గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. ముంపు గ్రామం నీటమునిగిన తర్వాత ఆమె కడపలో నివాసం ఉంటూవచ్చారు. మృతురాలి కోరిక మేరకు ముంపు గ్రామంలోనే అంత్యక్రియలు చేయనున్నట్లు బంధువులు తెలిపారు. ఈమె మృతికి పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

నీటి సంరక్షణే ధ్యేయం

లక్కిరెడ్డిపల్లి : నీటి సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని డ్వామా పీడీ టి.వెంకటరత్నం అన్నారు. కోనంపేట పంచాయతీలో వాటర్ షెడ్‌ల ఆవశ్యకతపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుచేసే కార్యక్రమం ప్రతి ఒక్కరూ చేపట్టాలని తెలిపారు. వాటర్ షెడ్ పథకం కింద అడిగిన ప్రతి రైతుకు ఫారం పాండ్, చెక్ డ్యాములు, పరికరాలు సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ రెడ్డయ్య, పీఓ వెంకట్రామిరెడ్డి, దప్పేపల్లి, పాలెం వాటర్ షెడ్ చైర్మన్‌లు, కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఈఓ

సంబేపల్లె : మార్చిలో జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని రాయచోటి ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీచర్లకు సూచించారు. లక్ష్య సాధన కోసం పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదవాలన్నారు.

కాంప్లెక్స్ సమావేశాల వేళలను మార్చండి

పెనగలూరు : కాంప్లెక్స్ సమావేశాల వేళలను మార్చాలని ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ పిల్లి రామ కృష్ణ తెలిపారు. తరగతులు నిర్వహించిన అనంతరం కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్లాలంటే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతునారన్నారు. అలాగే సాయంత్రం ఐదు గంటల వరకు కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. సమావేశాల పూర్తయ్యాక సొంత గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని ఉదయం వేళ కాంప్లెక్స్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు.

'లంచం పుచ్చుకున్నా.. తిప్పించుకుంటున్నారు

కుమారుడి బర్త్ సర్టిఫికెట్‌ను నాలుగు నెలలుగా మంజూరు చేయడంలేదంటూ ఆవేదన


సర్టిఫికెట్ మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు

ఒంటిమిట్ట : మండలంలోని కొత్త మాధవరానికి చెందిన లక్ష్మిదేవి తన కుమారుడి లేట్ బర్త్ సర్టిఫికెట్ పొందేందుకు నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. అప్పటి నుంచి ఒంటిమిట్టలోని రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఏదో వంకతో సర్టిఫికెట్ మంజూరు చేయకుండా బాధితురాలిని తిప్పుకుంటూనే ఉన్నారు. విసిగివేశారిన ఆమె కార్యాలయ సిబ్బంది లంచం ఇవ్వకుంటే పని జరగదు అని తేల్చిచెప్పడంతో గతంలో రూ.1100 లంచం రెవెన్యూ సిబ్బందికి ఇచ్చింది. అయినా కార్యాలయ సిబ్బంది సరైన ధృవీకరణ పత్రాలు లేవంటూ కాలయాపన చేస్తూ తిప్పుకుంటున్నారని గురువారం ఉదయం సర్టిఫికెట్ విషయమై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన లక్ష్మిదేవి విలేకరులకు తెలిపింది. డబ్బులు తీసుకున్న పని చేయకపోవడంతో ఆమె కన్నీటి పర్యంతం అయ్యింది. అనంతరం ఒంటిమిట్ట రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ దృష్టికి తన సమస్యను తీసుకెళ్లింది. స్పందించిన ఆయన సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం విచ్చేసిన ప్రజలు లక్ష్మిదేవి బాధను చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏ సర్టిఫికెట్ కావాలన్న ఇంటి వద్దకే వచ్చేందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో తమకు ఏ ధృవీకరణ పత్రం కావాలన్న నరకయాతన పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు భూములు, ఇంటి స్థలాలివ్వాలి

రెవెన్యూ కార్యాలయాల వద్ద సీపీఐ శ్రేణుల ఆందోళన


పుల్లంపేట: బంజర భూములను దళిత గిరిజనులకు పంచాలని కోరుతున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్/పుల్లంపేట/చిట్వేలి : పేదలకు వ్యవసాయ భూమి, ఇంటి స్థలాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆ పార్టీ మండల కార్యదర్శుల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు చేయూతనందించాలన్నారు. సిమెంటు, ఇసుక, కడ్డీలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ బంజరు భూములను పేద కుటుంబాలకు ఎకరా చొప్పున ఇచ్చి వ్యవసాయ యోగ్యంగా తయారు చేసుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని పేర్కొన్నారు. డిమాండ్‌లను నెరవేర్చని పక్షంలో మార్చి 10వ తేదీ నుండి సామూహిక నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. పుల్లంపేటలో బీకేఎంయూ, సీపీఐల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్న నాయకులు మండల పరిధిలోని రంగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కరింపాక రాచపల్లి యానాది కాలనీ వాసులకు ప్రభుత్వ బంజర భూములు పంచడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో కోడూరు సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, నరసయ్య, యువరాజ్, బుజ్జమ్మ, సోని, చిట్టమ్మ, మాధవి, అంకమ్మ, ప్రవీణ్, వసంత, పుల్లంపేటలో జరిగిన నిరసన కార్యక్రమంలో బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, టి.కృష్ణప్ప, సీపీఐ మండల కార్యదర్శి సేలం కుమార్, బీకేఎంయూ ఉపాధ్యక్షులు ఎం.వెంకటరమణ, గోపాల్, లక్ష్మయ్య, చిట్వేలిలో రైల్వేకోడూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నాయకులు తిప్పన ప్రసాద్, కటారు శంకరయ్య, గ్రామ కార్యదర్శి శ్రీను, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఆంధ్రయ్య, రాజు, లక్ష్మీదేవి, భాగ్యమ్మ, పేదలు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు అర్బన్: నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు


చిట్వేలి: జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

రసవత్తరంగా బండలాగుడు పోటీలు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆకేపాటి



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కాశిరెడ్డి నాయన స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం వృషభ రాజముల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలో మొత్తం 4జతల ఎద్దులు పాల్గొన్నాయి. బండలాగుడు పోటీలను టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. మొదటి బహుమతిని కమలాపురానికి చెందిన టి.వి. సుబ్బరాయుడు ఎద్దు, రెండవ బహుమతి ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వారకాల గురివిరెడ్డి ఎద్దు, మూడవ బహుమతి ప్రొద్దుటూరు పెన్నానగర్‌కు చెందిన కె.మహబూబ్ బాషా ఎద్దు గెలుచుకున్నాయి. కన్సలేషన్ బహుమతి రూ. 10వేలును వేముల మండలం రంగోరిపల్లె గ్రామానికి చెందిన మూలె ఎల్లారెడ్డి ఎద్దు పొందాయి. దాతల సహకారంతో నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు

కాశిరెడ్డినాయన 23వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు రామసుబ్బారెడ్డి వారికి శాలువా కప్పి పూలమాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కూలీలకు 150 రోజుల పని కల్పించాలి


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం : మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించిందని అన్నమయ్య జిల్లా ఉపాధి పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిట్లూరు గ్రామంలో పెద్దచెరువులో ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ చిట్లూరు గ్రామంలో 225 మంది కూలీలు పని చేస్తున్నారని, మండల వ్యాప్తంగా 2,200 పైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని చెప్పారు. ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలని తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా 2024 – 25 సంవత్సరానికి సంబంధించి రైతులు 38వేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపట్టామన్నారు. ఉపాధి పనులను కావాల్సిన కూలీలకు 150 రోజులు పనులు కల్పిస్తామన్నారు. ఎవరూ వలసలు వెళ్లకుండా పనులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులు తమ పొలాలలో ఫారం పాండ్ పనులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్య, టీఏలు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను కాపాడటం అందరి బాధ్యత


అవగాహన కల్పిస్తున్న రేంజర్ కళావతి


సిద్దవటం : అడవులను కాపాడటం మనందరి బాధ్యత అని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం రేంజ్‌లోని సిద్దవటం బీటు సాబ్బావి బేస్ క్యాంప్ పరిసర ప్రాంతాల్లో గురువారం సిద్దవటం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ కళావతి విద్యార్థులకు అడవుల గొప్పదనం, వైల్డ్ లైఫ్ బిహేవియర్, వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, హ్యాబిటెడ్ మేనేజ్‌మెంట్, ఫైర్ లైన్ క్రియేషన్, సాసర్ పిట్స్, ప్లాంటేషన్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, ఫారెస్టు బీటు అధికారి పెంచల్‌రెడ్డి, అసిస్టెంటు బీటు అధికారి హైమావతి, ఫారెస్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి


రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కమ్యూనిస్టు నేతలు, పేదలు


రాజంపేట : కూటమి ప్రభుత్వం పట్టణ, గ్రామీణ పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు వ్యవసాయ కూలీలకు వ్యవసాయ భూమిని అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు, పేదలతో కలసి రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎల్ నరసింహులు మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలన్నారు. పేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్లు ఇంటి స్థలాలు, ప్రతి పేదవాడికి రెండు ఎకరాలు భూమి ఇస్తామని చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. దళితులు, గిరిజనులకు ఇచ్చిన భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలన్నారు. కూటమి పార్టీల నాయకులు అధికారుల అండతో వందల ఎకరాలను రాత్రికిరాత్రికే ఆన్‌లైన్ చేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణ దేవర, పట్టణ కార్యదర్శి సికిందర్, నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలిచంద్ర, సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, రమణ, సుబ్రమణ్యం, కాసీం, మహమ్మద్‌హుసేన్, నరసింహ, పెంచలయ్య, మహిళలు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా


బోల్తాపడిన ఆటో

వీరబల్లి : మండలంలోని గడికోట ప్రాంతం నుంచి ఓ మిఠాయి ఆటో వ్యాపార నిమిత్తం గురువారం తెల్లవారుజామున వీరబల్లి మండల కేంద్రానికి వస్తూ గడికోట ఘాట్‌రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. బుధవారం రాత్రి గడికోట ప్రాంతంలోని ఎడబల్లి దగ్గర మాండవ్య నది ఒడ్డున వెలసిన గురుస్వామి దేవాలయంలో తిరునాల జరుగగా సుండుపల్లి మార్గంలో ఉన్న అనుంపల్లి గ్రామానికి చెందిన ఏపీ39 టీటీ1291 నెంబరుగల మిఠాయి ఆటో వ్యాపారం ముగించుకొని గురువారం తెల్లవారుజామున తిరిగి వస్తూ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

'సరోజినీ' అడుగుజాడల్లో మహిళలు నడవాలి


మహిళలను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


పుల్లంపేట: దళవాయిపల్లి పాఠశాలలో..

పుల్లంపేట : దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సరోజినీ నాయుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సరోజినీ నాయుడు స్వాతంత్ర్య సమరయోధురాలని, మొదటి మహిళా గవర్నర్‌గా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి పనిచేశారన్నారు. నేటి మహిళలు ఆదర్శంగా తీసుకొని, ఆమె అడుగుజాడల్లో నడవాలని సూచించారు.

మహిళలకు సత్కారం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని లక్ష్మీనగర్‌లో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహిళలకు వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు మహిళలకు ఘనంగా సన్మానించారు. సమాజంలో మహిళలు చేస్తున్న సేవలను కొనియాడారు.

షబ్-ఏ-బరాత్ శుభాకాంక్షలు



రాయచోటి టౌన్ : నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి షబ్ – ఏ – బరాత్ శుభాకాంక్షలు తెలియచేశారు. ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా షబ్ – ఏ – బరాత్ జరుపుకొంటారని తెలిపారు. భగవంతుడి దయతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

అన్ని వేళలా అందుబాటులో ఉంటా

రాయచోటి టౌన్ : రాయచోటి తహసీల్దార్‌గా నరసింహ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాయచోటి ప్రాంతంలోని ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం తన సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వచ్చే వారి అర్జీలను స్వీకరించి సమస్యను తాత్సారం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఈయన గతంలో రాయచోటి డీటీగా పనిచేశారు.

మినీ గోకులం ప్రారంభం

ఒంటిమిట్ట : చిన్న కొత్తపల్లి గ్రామంలో గురువారం పాడి రైతుల సౌకర్యార్థం టీడీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మినీ గోకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రిబ్బన్ కట్ చేసి దేవుళ్ల పటాలకు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి ప్రారంభించారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ


మెటీరియల్స్‌ను పంపిణీ చేసిన ఎస్టీయూ నాయకులు

సుండుపల్లె : గుంతరాచపల్లి జెడ్పీహెచ్ఎస్ పది విద్యార్థులకు యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.శంకర్ గురువారం ఉచితంగా పరీక్ష మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. మెటీరియల్‌ను బాగా చదువుకొని మంచి మార్కులు సంపాదించాలని తెలియజేశారు.

నివాళి

పెనగలూరు : మండలంలోని చక్రంపేట గ్రామంలో కంచర్ల చిన్నపరెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చిన్నపరెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చక్రంపేట మాజీ సర్పంచ్ ఆంజనేయులు రెడ్డి, విశ్వనాథరెడ్డి, కళ్యాణ్ రెడ్డి, దండు గోపి, సాంబత్తిన శ్రీను, బడుగుంటపల్లి అమర్ తదితరులు పాల్గొన్నారు.